క్లుప్తంగా

కొల్లూరు తహసీల్దార్ బదిలీ

కొల్లూరు : కొల్లూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ. శ్రీనివాసరావును ఎన్నికల బదిలీలలో భాగంగా ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్న తహసీల్దార్ శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు కొత్త తహసీల్దార్‌ను కొల్లూరు మండలానికి కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల ప్లేట్లు వితరణ



కొల్లూరు : కొల్లూరులో 1984–1985 ఏడాదిలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు ప్రోత్సాహకంగా నిలవాలని నిశ్చయించుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న గోరు ముద్దకు తోడు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్న లక్ష్యంతో కొల్లూరు బాలురోన్నత పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ చేశారు. బుధవారం కొల్లూరు బాలురోన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం ప్లేట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగపాప సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

రేపల్లెరూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సెంటరులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సదస్సును నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామభోపాల్‌రెడ్డి, సంకల్పయాత్ర పరిశీలకులు కే.శ్రీనివాసరాజు, బీజేపీ నాయకులు సాయివరప్రసాద్, బేతపూడి వెంకటేశ్వరరావు, గుమ్మడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో మెరిసిన ఖాజీపాలెం బాలికలు



పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామానికి చెందిన బాలికలు ఆడుదాం ఆంధ్రా పోటీలలో ఖోఖో క్రీడలో బాపట్ల జిల్లా జట్టులో ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైయ్యారు. ఖాజీపాలెం గ్రామానికి చెందిన బాలికలు జిల్లా స్థాయి ఖోఖో క్రీడలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావటం సంతోషకరమని గ్రామసర్పంచ్ కుంతం అనూష, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నరాజులు అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

ప్రజా సమస్యలపై గళమెత్తిన యోధుడు గద్దర్

తెనాలి: సమాజ సమస్యలపై సూచనప్రాయంగా తన పాటల ద్వారా ప్రజా యుద్ధనౌక గద్దర్ వివరించేవారని సాంస్కృతిక యోధుడు గద్దర్ 76వ జయంతి సభలో వక్తలు పేర్కొన్నారు. స్థానిక రామలింగేశ్వర పేట దేవీ చౌక్‌లోని ప్రజా ఉద్యమాల నిర్మాణ కార్యాలయంలో ఏర్పాటైన సభలో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంత్రపాటి అశోక్‌కుమార్ మాట్లాడారు. దళితులు, బడుగు, బలహీనవర్గాలపై జరిగిన దాడులపై గర్జించటమే కాకుండా భూములు, పరిశ్రమలు, మైనింగ్‌లు, వాణిజ్యపంటలు, వ్యాపార సముదాయాలు, రవాణా వ్యవస్థలు కలిగిన యాజమాన్యాలు కార్మికుల ప్రయోజనాలను విస్మరించటంపైనా గద్దర్ తన పాటతో పోరాటం చేశారని గుర్తుచేశారు. నాస్తిక సమాజం నందూరి నారాయణరావు, మానవతావాది రావూరి శివకృష్ణ, విశ్రాంత సీఐ కఠారి విక్టర్ బాబు, ఆర్మీ అధికారి శ్రీనివాసరావు, జాలాది మోజెస్, కొప్పరాజు సుందరాములు, ప్రజాస్వామ్య పరిరక్షక ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు బ్రహ్మానందరెడ్డి, దివ్వెల ఏడుకొండలు, సీడేపూడి శ్రీనివాసరెడ్డి, కోళ్ల మధుబాబు పాల్గొన్నారు. తొలుత గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యశాల ఫిజీషియన్ డాక్టర్ వినీల్ సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను బుధవారం మారీసుపేట రెండు గేట్ల మధ్యలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌లో స్పెషలిస్ట్ వైద్యులను ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. 24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య మాట్లాడుతూ సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కండి

ఆర్డీవో హెలా షారోన్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఆర్డీవో హెలా షారోన్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్‌లు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో గతంలో 263 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈ విడతలో అదనంగా ఒక పోలింగ్ కేంద్రం మంజూరై మొత్తం 264 పోలింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయన్నారు. మండల కేంద్రమైన అంబేడ్కర్ నగర్‌లో 179వ పోలింగ్ కేంద్రం అదనంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నూతనంగా ఏర్పడిన పోలింగ్ కేంద్రంపై కేంద్రం పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వివరాలను తమకు అందజేయాలన్నారు. ఇప్పటికే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగుల కోసం ర్యాంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు డి.మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిచేయండి



ఓటరు జాబితాలో తప్పులను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి

పిట్టలవానిపాలెం: ఓటరు జాబితాలో తప్పులను సరిచేయాలని మండల తహసీల్దార్ డి.కవిత ఆదేశించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏజంట్లు, బూత్ అధికారులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొందరి ఫోటోలు, ఆధార్ నెంబర్‌లు తప్పుగా నమోదయినట్లుగా ఫిర్యాదులున్నాయని వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలు తప్పుల తడకలతో నిండి ఉన్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంటి నెంబర్ ప్రకారం ఒకేచోట ఉండాల్సిన ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వరుస క్రమంలో తేడాలున్నాయని తెలిపారు. కొన్ని గ్రామాలలో ఒక పోలింగ్ బూత్‌లో రెండు ఓట్లు మరో పోలింగ్ బూత్‌లో రెండు ఓట్లు నమోదయ్యాయని తెలిపారు. దీంతో ఓటర్లు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. కొంత మందికి తెలంగాణా రాష్ట్రంతో పాటు ఏపీలో సైతం ఓటు ఉందని అలాంటి వాటిని పరిశీలించి తొలగించాలని కోరారు.ఈ విషయంపై తహసీల్దార్ కవిత స్పందిస్తూ తెలంగాణాలో ఓటు ఉండి ఏపీలో కూడా ఓటు ఉన్నట్లయితే చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని అన్నారు. మిగిలిన అంశాలలో పరిశీలించి డోర్‌నెంబర్ వారీగా ఓట్లు వరుస క్రమంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ విక్టర్, ఇన్‌చార్జ్ ఆర్ అమానుల్లా ఖాన్, వీఆర్వోలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొలగాని సుబ్బారావు, కుక్కల సుబ్రమణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసు సిబ్బందికి అండగా నిలుస్తాం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



పదవీ విరమణ చేసిన హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ

బాపట్లటౌన్: పదవీ విరమణచేసిన పోలీస్ సిబ్బందికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. పదవీ విరమణ చేసిన హోంగార్డు జీవీ. మహేశ్వరరెడ్డిని బుధవారం ఘనంగా సన్మానించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుగా విధుల్లో ప్రవేశించి చీరాల హోంగార్డు యూనిట్ నందు 36 సంవత్సరాల పాటు పోలీస్‌శాఖకు సేవలు అందించారన్నారు. పోలీస్ శాఖలో నిబద్ధతతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోంగార్డులకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం పోలీస్‌శాఖ తరుపున మహేశ్వరరెడ్డికి బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎమ్.డి.హెచ్ ప్రేమ్ కుమార్, హోంగార్డు ఆర్.ఐ ఎల్.గోపీనాథ్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల పూడికతీత పనులు పరిశీలన

తెనాలిఅర్బన్: సుందర తెనాలి నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. మారీసుపేటలోని రేపల్లె గేటు ప్రాంతంలో బుధవారం ఉదయం ఆమె పర్యటించారు. అక్కడ జరుగుతున్న కాలువల పూడిక తీత పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాలువలపై కొందరు మెట్లు, నాపరాళ్లు వేయటం వంటివి చేస్తున్నారని దీనివల్ల కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తీయటం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. ఆమె వెంట మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, బాపట్ల 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మార్చి 9వ తేదీన జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగా వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశలో లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సేవలతోనే సంతృప్తి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అన్నపూర్ణ

తెనాలిటౌన్: వృత్తిపట్ల అంకితభావంతో పని చేసి ఎందరో ప్రజలకు వైద్యసేవలు అందించిన పద్మశ్రీ అభినందనీయురాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అన్నపూర్ణ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్‌గా పని చేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన నారంశెట్టి పద్మశ్రీ అభినందన సభ కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో జరిగింది. పీహెచ్ఎన్ పద్మశ్రీ, మల్లేశ్వరరావు దంపతులను పలువురు వైద్యులు ఘనంగా సత్కరించారు.

పీఎల్‌వీల ఎంపికకు నోటిఫికేషన్

తెనాలిరూరల్: పారా లీగల్ వలంటీర్ల ఎంపికకు మండల న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, బాపట్ల 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు, అంగన్‌వాడీ క్యాకర్తలు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు, వైద్యులు, విద్యార్థులు, లా విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపరవాణా కమిషనర్ కరీం, అధికారులు

జిల్లా ఉప రవాణా కమిషనర్ కరీం

తెనాలిరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో తెనాలి మార్కెట్ యార్డు నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఉప రవాణా కమిషనర్ మాట్లాడుతూ గతేడాది జిల్లాలో 985 రోడ్డు ప్రమాదాలు జరుగగా 232 మంది మృత్యువాత పడ్డారని తెలిపారు. హెల్మెట్ ధరించిన వారికి ప్రాణాపాయం తప్పిందని వివరించారు. వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాల్, టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు, టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్, ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న వేద పండితులు

తెనాలిటౌన్: పట్టణ కొత్తపేటలోని తాలూకా స్కూల్ గ్రౌండ్ ఆవరణలో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి, వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు బుధవారం మూడోరోజు వైభవంగా నిర్వహించారు. పూజ్యశ్రీ బాలస్వామీజీ పర్యవేక్షణలో ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, అర్చనలు, అభిషేకాలు జరిపారు. వేదపండితులు హోమాలు జరిపి గోపూజలు చేశారు. స్వామివారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ప్రముఖ అన్నమాచార్యుల ఉపాసకురాలు శోభారాణి అన్నమయ్య విశిష్టతను, శ్రీనివాసుని వైభవం గురించి తెలిపారు. అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. బాలస్వామీజీ సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించి, దాని విశిష్టతను తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయం

సువార్తకులు డాక్టర్ పాల్ ఇమ్మానియేల్



ఆరాధన చేస్తున్న డాక్టర్ పాల్ ఇమ్మానియేల్, నిస్సీ పాల్

తెనాలిఅర్బన్: క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని అంతర్జాతీయ సువార్తకులు డాక్టర్ పాల్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. విజయవాడలోని క్రైస్ట్ టెంపుల్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన సువార్త సభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధించిన ప్రేమతత్వాన్ని అందరూ అలవర్చుకోవాలన్నారు. శాంతి, దయ, కరుణ వంటి గుణాలు కలిగి ఉండాలని సూచించారు. ముందుగా నిస్సీ పాల్ ఆరాధనలో సభను కొనసాగించారు. శుక్రవారం వరకు సభలు జరుగుతాయని ఆమె చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు సభలు ప్రారంభమవుతాయని తెనాలి పట్టణ, పరిసర ప్రాంత క్రైస్తవులు అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు, క్రైస్ట్ టెంపుల్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా బండి శేషన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై తెనాలి వచ్చారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన ఎం జశ్వంతరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ తెనాలి పట్టణంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగుల సహకారంతో తెనాలి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతం



తెనాలిటౌన్: విద్యార్థులను తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల అన్నారు. రూరల్ మండలం కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు గా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన దావులూరి విజయ అభినందన సభను పాఠశాలలో నిర్వహించారు.సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. సభలో డిప్యూటీ డీఈవో నిర్మల మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని అన్నారు. విద్యార్థి, ఉపాధ్యాయుడి మధ్య ఆత్మీయ బంధం ఉండాలన్నారు. ఎంఈవో లక్ష్మీనారాయణ, ఎంఈవో-2 జయంతిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ కనపర్తి శశికుమార్, విశ్రాంత హెచ్ఎం కృష్ణమాచారితో పాటు పలువురు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే పురోగతి



సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ విజయనిర్మల

నిజాంపట్నం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలని ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఎంపీపీ విజయనిర్మల మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశం ప్రగతి బాటలో పయనిస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అర్హత ఉండి సాంకేతిక లోపాలవల్ల సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చేయాలని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను కల్పించేందుకు కృషిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి హరనాథబాబు, ఎంపీడీవో నాగలక్ష్మి, తహసీల్దార్ నెహ్రూబాబు, కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ బసవపున్నారావు, నాజర్‌ఖాన్, మండల వైస్ ఎంపీపీ తోటకూర సుబ్బారావు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టామంగ

రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అధికారులతో చర్చించటం జరిగిందన్నారు. తాగునీటికి అంతరాయం కలుగకుండా నిరంతరం పంపిణీ జరిగేలా అధికారులతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. కౌన్సిలర్‌లు తమ వార్డుల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం అజెండాలోని 36 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ రామభోపాల్‌రెడ్డికి కౌన్సిల్ శుభాకాంక్షలు తెలిపింది. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ రామభోపాల్‌రెడ్డి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రఘుపతి

బాపట్ల: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని 12వ వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం చేపట్టారు.ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవడంతోనే ఏపీ భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు మద్దసాని సుధాకర్, నర్రావుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: చోరీలకు పాల్పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లా యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్. రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం తేతలీ గ్రామానికి చెందిన 27 ఏళ్ల పంది మణికంఠ చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఖర్చులకు డబ్బుల కోసం చోరీలకు అలవాటు పడ్డాడు. రైళ్లలో తిరుగుతూ ఆయా రైల్వే స్టేషన్‌ల పరిసరాల్లోని ఇళ్లు, దుకాణాల్లో చోరీలకు ప్పాడుతుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీన రాత్రి మారీసుపేట ఆషా థియేటర్ సమీపంలోని ఓ ఆటోమొబైల్ దుకాణ తాళాలు పగులగొట్టి దుకాణంలోని గల్లాలో ఉంచిన రూ. 55 వేలు అపహరించుకెళ్లాడు. బాధిత దుకాణ యజమాని పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని మణికంఠగా గుర్తించి అతని కదలికలపై నిఘా ఉంచారు. అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తెనాలి చెంచుపేటలోని ఓ ఇంట్లో రూ.43వేల నగదు, రెండు చెవి జుంకాలు, రెండు ఉంగరాలు, బాలాజీరావుపేటలోని ఓ ఇంట్లో రూ.రెండు వేల నగదు, రెండు ఉంగరాలు, వెండి పట్టీలు అపహరించినట్టు అంగీకరించాడు. అతను ఇచ్చిన సమాచారం మేరకు రూ.25 వేల నగదు, ఆభరణాలను పోలీసుల స్వాధీనపర్చుకున్నారు. కేసులను చేధించిన ఏఎస్ఐలు పి. దేవప్రసాద్, హైదర్‌అలీ, పీసీలు ఎం.అంకయ్య, పి.మురళిలను సీఐ రమేష్‌బాబు అభినందించారు.

డాక్టర్ బాబుకు తుమ్మల సాహితీ పురస్కారం

హాజరైన ప్రముఖ సినీ, సాహిత్య, విద్యావేత్తలు



డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడికి పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ప్రముఖులు

తెనాలి: ప్రవాసంలో ఉంటూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి తనకు స్ఫూర్తి ప్రదాత అని ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా చెప్పారు. గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం, తెనాలి కళల కాణాచి సంయుక్త నిర్వహణలో బుధవారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ సాహిత్యోద్యమ నిర్మాత తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారాన్ని డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడికి ప్రదానం చేసి సత్కరించారు. డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ స్వచ్ఛమైన మనసుతో తెలుగు భాష, సినిమాకు సేవచేస్తున్న డాక్టర్ బాబు తుమ్మలకు సాహితీ పురస్కారాన్ని అందజేయటం సముచితంగా అభివర్ణించారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ మానవత్వ విలువలు తగ్గిపోతూ వ్యతిరేక భావనలు ఎక్కువవుతున్న నేటిరోజుల్లో సానుకూల భావనలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి తనకు సాహిత్యంపై ఆసక్తి ఉండేదని చెప్పారు. సాహితీ దిగ్గజాలతో సాన్నిహిత్యంతో తెలుగు భాషపై అనురక్తి పెరిగిందన్నారు. ఉత్తమ తెలుగు సినిమాలను భద్రపరిచినట్టు వివరించారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తన ప్రసంగంలో కామ్రేడ్ తుమ్మల జీవిత విశేషాలను వివరించారు.